సాక్షి ప్రకాశం

సోమవారం ౹ 2 ౹ జూన్ ౹ 2025



బియ్యం ధరలతో బెంబేలు

పశ్చిమ ప్రకాశంలో బియ్యం కొరత ఏర్పడింది. స్థానికంగా వరిసాగు తగ్గిపోవడంతో ఉత్పత్తి తగ్గి ఇతర ప్రాంతాల నుంచి బియ్యం తెచ్చి విక్రయిస్తున్నారు.

- 8లో..



క్రీడల్లో మహిళల సత్తా అభినందనీయం

క్రీడల్లో మహిళలు సత్తాచాటడం అభినందనీయమని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు.

- 8లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం 37/28

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా ఉరుములు మెరుపులతో వర్షం పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు హెచ్‌ఎంల పదోన్నతుల కౌన్సెలింగ్

ఒంగోలు సిటీ: జిల్లా పరిషత్ యాజమాన్యం కింద మే నెల 30వ తేదీ జరిగిన గ్రేడ్–2 ప్రధానోపాధ్యాయుల పదోన్నతుల కౌన్సెలింగ్‌లో మిగిలిన 3 ఖాళీలు, 2 రిటైర్మెంట్ ఖాళీలకు సోమవారం ఉదయం 9 గంటలకు డీఆర్‌ఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు డీఈఓ ఎ.కిరణ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి సంబంధించిన సీనియారిటీ జాబితాలో మిగిలిన సీరియల్ నంబరు 141 నుంచి తప్పనిసరిగా అందరూ హాజరు కావాలని డీఈఓ కోరారు.

ప్రజల సమస్యల పరిష్కారానికి కాల్ సెంటర్

- కాల్ సెంటర్ నంబర్ 1100

ఒంగోలు సబర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా కాల్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా తెలిపారు. ఈ మేరకు ఆమె ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో కాల్ సెంటర్ నంబర్–1100 ను ప్రవేశపెట్టారన్నారు. ఈ కాల్ సెంటర్ ద్వారా ప్రజలు సమస్యలను ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవచ్చని చెప్పారు. అర్జీదారులు 1100 నంబర్‌కు డయల్ చేసి, తమ సమస్యను విన్నవిస్తే ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసి సంబంధిత అధికారికి మీ సమస్యను పంపి తద్వారా పరిష్కరిస్తారన్నారు. అనంతరం మీ మొబైల్ నంబర్‌కు ఎస్‌ఎంఎస్ ద్వారా నిర్ధారణ సందేశం పంపుతారని వివరించారు. అర్జీ స్థితి/సమాచారం కోసం కాల్ చేసి తెలుసుకోవచ్చన్నారు. జిల్లాలోని ప్రజలు కాల్ సెంటర్ నంబరును వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు.

సీఐడీ విచారణకు యుపిక్స్ కేసు !

ఒంగోలు టౌన్: యానిమేషన్ పేరుతో వందలాది కోట్ల రూపాయలు వసూలు చేసిన యుపిక్స్ కంపెనీ విచారణ కేసును సీఐడీకి అప్పగించాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. విజయవాడకు చెందిన నిడుమోలు కిరణ్, అతడి కుటుంబ సభ్యులు ఒంగోలుకు చెందిన వ్యాపారి ఆత్మకూరి అమరలింగేశ్వరరావు వద్ద నుంచి రూ.5 కోట్లు వసూలు చేసినట్లు ఒంగోలు తాలూకా పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. అయితే ఈ కేసు దర్యాప్తు ప్రారంభించిన పోలీసులకు దిమ్మతిరిగి పోయింది. ఈ కేసులో ఎక్కువ మంది బాధితులు నరసరావుపేటకు చెందిన వారు ఉన్నట్లు గుర్తించారు. ఒంగోలు బాధితుడైన అమరలింగేశ్వరరావు స్వగ్రామం కూడా నరసరావుపేట అని తేలింది. వ్యాపార రీత్యా కొన్నేళ్ల నుంచి ఆయన ఒంగోలులో ఉంటున్నట్లు సమాచారం. నరసరావుపేటకు చెందిన స్నేహితుల ద్వారా కిరణ్ పరిచయమైనట్లు తెలుస్తోంది. యానిమేషన్ వ్యాపారంలో పెట్టుబడి పెడితే 14 నెలల్లో రెట్టింపు లాభం కలిపి ఇస్తానని నమ్మబలకడంతో అమరలింగేశ్వరరావు రూ.5 కోట్ల పెట్టుబడి పెట్టారు. ఆ తరువాత నెలకు రూ.1.50 లక్షల ప్రకారం మూడేళ్లపాటు డబ్బులు చెల్లించాడని, 14 నెలల్లో రెట్టింపు ఇస్తానని చెప్పి నెలవారీగా డబ్బులు చెల్లించడం ఏమిటని గట్టిగా నిలదీయడంతో మొహం చాటేసినట్లు సమాచారం. దీంతో ఆయన పోలీసులను ఆశ్రయించడం, కేసు విచారణకు యర్రగొండపాలెం సీఐ ప్రభాకరరావును నియమించారు. ఈ విషయం తెలుసుకున్న కిరణ్ ఉత్తరాఖండ్‌కు పరారయ్యాడు. అతడి సమాచారాన్ని సేకరించిన పోలీసులు రుషికేష్‌లో ఉన్న కిరణ్‌ను ఆదివారం ఒంగోలు తీసుకొచ్చి విచారిస్తున్నట్లు తెలుస్తోంది. విచారణలో నరసరావుపేట, విజయవాడ, వైజాగ్ ప్రాంతాల్లో సుమారు రూ.1000 కోట్లు వసూలు చేసినట్లు తెలిసింది. దాంతో ఈ కేసును సీఐడీకి అప్పగించాలని ఎస్పీ నిర్ణయించినట్లు సమాచారం.



ఒంగోలులో రేషన్ బియ్యాన్ని అతికష్టమ్మీద ఇంటికి మోసుకెళ్తున్న వృద్ధురాలు

నిరుపేదలకు రేషన్ కష్టాలు మళ్లీ మొదలయ్యాయి. సుదూర ప్రాంతాల్లో ఉన్న రేషన్ షాపులకు వెళ్లి నిత్యావసరాలు తెచ్చుకోలేని వారి కోసం ఇంటి వద్దకే రేషన్ పంపిణీ చేసేందుకు గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన ఎండీయూ వాహనాలను కూటమి ప్రభుత్వం రద్దు చేయడంతో కార్డుదారులు మళ్లీ రేషన్ షాపుల బాట పట్టారు. కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లి షాపు దగ్గర గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉండి రేషన్ తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వృద్ధులు, వికలాంగులకు ఇళ్ల వద్దకే రేషన్ ఇస్తామని చెప్పినా ఎక్కడా అమలు కాలేదు. నడవలేని స్థితిలో ఉన్నా.. గత్యంతరం లేక ఎవరో ఒకరి సాయం తీసుకుని రేషన్ షాపులకు వచ్చి సరుకులు తీసుకెళ్లాల్సి వచ్చింది. చాలా చోట్ల రేషన్ దుకాణాలు తెరవకపోవడంతో కార్డుదారులు నిరాశతో వెనుదిరిగారు. జిల్లా వ్యాప్తంగా రేషన్ దుకాణాల వద్ద తొలిరోజు నిత్యావసరాల పంపిణీపై 'సాక్షి' గ్రౌండ్ రిపోర్ట్.

తొలిరోజే పరేషాన్

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

పడిగాపులు.. మోత బరువులు

7 కి.మీ దూరంలో రేషన్ దుకాణం



ఈ యువకుడి పేరు పొద్దుటూరి బాషా. కొమరోలు మండలంలో గుంతపల్లె నుంచి 7 కిలోమీటర్ల దూరంలో ఉన్న బెడుసుపల్లె గ్రామానికి కొండ ఎక్కి కొండ దిగి ద్విచక్ర వాహనంపై వచ్చి రేషన్ సరుకులు తీసుకున్నాడు. ప్రస్తుతం సెలవులు కావడంతో తన స్నేహితుడి సహాయంతో బైక్‌పై వచ్చి రేషన్ సరుకులు తీసుకుని వెళ్లాడు. తరువాత చదువుల కోసం బయటకు వెళతాడు. తన తల్లిదండ్రులు ఇంత దూరం ప్రయాణించి సరుకులు తీసుకోలేరని అంటున్నాడు. ఎండీయూ వాహనాల ద్వారా సరుకులను అందించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నాడు.

- రేషన్ వాహనాల రద్దుతో ఇంటి వద్దకే నిత్యావసరాల సరఫరాకు మంగళం
- జిల్లా వ్యాప్తంగా మొరాయించిన సర్వర్లు
- మొదటి రోజు రేషన్ షాపుల వద్ద గంటల తరబడి కార్డుదారుల పడిగాపులు
- కేవలం బియ్యం, చక్కెర మాత్రమే ఇస్తున్న డీలర్లు
- ఈ నెలలో కూడా కందిపప్పు ఇవ్వని సర్కారు
- ఆటోలకు బాడుగలు చెల్లించి మరీ రేషన్ తీసుకెళ్లాల్సిన దుస్థితి
- నాయకులు రాలేదని రేషన్ ఇవ్వకుండా కార్డుదారులను ఇబ్బంది పెట్టిన డీలర్లు
- కొన్ని చోట్ల రేషన్ దుకాణాల తాళాలే తీయని వైనం
- వృద్ధులను రేషన్ షాపులకు రప్పించి మరీ రేషన్ ఇస్తున్న డీలర్లు



ఒంగోలు నగరంలోని బలరాంకాలనీ చౌకధరల దుకాణం వద్ద ఎండలో క్యూలో నిల్చొని ఉన్న ప్రజలు

ఒంగోలు సబర్బన్: రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసరాల పంపిణీ తొలిరోజు ప్రహసనంగా మారింది. పేదలు రేషన్ సరుకుల కోసం గంటల తరబడి క్యూలైన్లలో నిరీక్షించకూడదనే సదుద్దేశంతో గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇంటి వద్దకే రేషన్ ఎండీయూ (మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్లు) విధానాన్ని తీసుకొచ్చారు. అలాంటి విధానానికి మంగళం పాడిన ప్రస్తుత టీడీపీ కూటమి ప్రభుత్వం ఆ వాహనాలను పూర్తిగా రద్దుచేసింది. మళ్లీ పాత వ్యవస్థను తీసుకొచ్చి ప్రజల కష్టాలకు తెర తీసింది. ఈ నిర్ణయంతో రేషన్ సరుకుల పంపిణీ ఇక డీలర్ల దయాదాక్షిణ్యాల మీదే ఆధారపడి ఉంటుందనటానికి ఆదివారం నుంచి ప్రారంభమైన రేషన్ పంపిణీనే నిదర్శనం. రేషన్ కష్టాలు, మోత బరువు మళ్లీ దాపురించిందని పేదలు వాపోతున్నారు.

సర్వర్ల మొరాయింపు...పడిగాపులు...

జిల్లా వ్యాప్తంగా రేషన్ షాపుల్లో సర్వర్లు మొరాయించడంతో కార్డుదారులు గంటల తరబడి షాపుల వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చింది. పండుగ వాతావరణంలో పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించడంతో రేషన్ షాపులు పసుపు బెలూన్లతో నిండిపోయాయి. కొన్ని చోట్ల అయితే షాపు ప్రారంభానికి టీడీపీ కూటమి నాయకులు రాలేదని షాపు వద్దకు రేషన్ కోసం వచ్చిన వారిని గంటల తరబడి కూర్చోబెట్టారు. దాంతో ప్రజలు అసహనానికి గురయ్యారు. రేషన్ షాపు డీలర్‌ను ఏమీ అనలేని పరిస్థితి. ఎందుకంటే డీలరు కూడా ఒక రాజకీయ నాయకుడే కావటంతో కిమ్మనకుండా కూర్చోవాల్సిన పరిస్థితులు ఎదురయ్యాయి.

రెండు వస్తువుల కోసం ఏమిటీ పడిగాపులు...

కూటమి ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా ఇస్తున్న రెండు వస్తువుల కోసం ఏమిటీ పడిగాపులు అని షాపుల వద్దకు వచ్చిన వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం రేషన్ షాపుల్లో కేవలం బియ్యం, చక్కెర మాత్రమే ఇస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో పురుగులు పట్టిన బియ్యాన్ని సరఫరా చేసేవారు. అలాంటిది వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక సార్టెక్స్ (నాణ్యమైన) బియ్యాన్ని పంపిణీ చేయడం ద్వారా పేద ప్రజల కడుపునింపారు. దీంతో పాటు పంచదార, కందిపప్పు, మిల్లెట్స్, గోధుమ పిండి వంటి నిత్యావసరాలను సబ్సిడీపై అందించారు. 2024లో చంద్రబాబు మళ్లీ అధికారంలోకి వచ్చిన తర్వాత గత ఏడాది కాలంలో నెమ్మదిగా ఒక్కోటి ఎగిరిపోయాయి, ఇప్పట్లో కందిపప్పు ఇచ్చే పరిస్థితి లేదు. కేవలం బియ్యం, పంచదార మాత్రమే అందిస్తున్నారు. దీని కోసం కూటమి ప్రభుత్వం పేద ప్రజలను రోడ్లపైకి తీసుకొచ్చిందని ప్రజలు విమర్శిస్తున్నారు. ఆరు నెలలుగా చంద్రబాబు కూటమి ప్రభుత్వం కందిపప్పు ఊసే లేకుండా చేసింది.

సర్వర్ పనిచేయక పడిగాపులు

మద్దిపూడి: రేషన్ దుకాణాల్లో రేషన్ పంపిణీ చేసేందుకు ఈపాస్ మిషన్‌లలో కార్డుదారులు థంబ్ వేయాల్సి ఉంది. అయితే సర్వర్ సక్రమంగా పని చేయకపోవడంతో కార్డుదారులు గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. మద్దిపూడిలో మండల స్థాయి టీడీపీ నాయకులు రేషన్ దుకాణం నంబర్ 2 వద్దకు చేరుకుని ఎంతో ఆర్భాటంగా పచ్చతోరణాలతో పంపిణీ ప్రారంభించారు. అయితే సర్వర్ పనిచేయకపోవడంతో అక్కడే పిచ్చాపాటి కబుర్లు చెప్పుకుని.. డీలర్, రెవెన్యూ అధికారులతో కలిసి టీలు, కాఫీలు తాగి వెళ్లిపోయారు.



సర్వర్ పనిచేయకపోవడంతో పడిగాపులు కాస్తున్న టీడీపీ నాయకులు, రెవెన్యూ సిబ్బంది

సమయపాలన ఏదీ...



త్రోవగుంట ఎస్సీ కాలనీలో ఉదయం 11 గంటలకు తాళం వేసి ఉన్న చౌకధరల దుకాణం

రేషన్ ప్రారంభించిన మొదటి రోజే రేషన్ డీలర్లు సమయ పాలన పాటించలేదు. కొన్ని చోట్ల ఉదయం 11 గంటలకు కూడా రేషన్ షాపులకు తాళాలు వేసి ఉన్నాయి. జిల్లాలోని రేషన్ షాపులు 1,392 ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం కార్డులు 6,70,571 కాగా సరఫరా చేస్తున్న సరుకులు బియ్యం 9,500 మెట్రిక్ టన్నులు, చక్కెర 350 మెట్రిక్ టన్నులు మాత్రమే. ఉదయం 8 నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు రేషన్ అందజేయాలి. అలాంటిది మొదటి రోజే రేషన్ డీలర్లు ఇష్టారీతిన వ్యవహరించి ప్రజలను నానా ఇబ్బందులకు గురిచేశారు. ఆదివారం కావటంతో పనులకు వెళ్లని వాళ్లు కాబట్టి సర్దుకు పోయారు. ఇక పనిదినాల్లో రేషన్ కోసం ప్రజల అవస్థలు వర్ణనాతీతంగా ఉంటాయన్నది మొదటి రోజే అర్థమైంది.



పొదిలి మండలం కొండాయపాలెం రేషన్ దుకాణానికి 2 కి.మీ నడుచుకుంటూ బయలుదేరిన సలకనూతల ఎస్సీ కాలనీ వాసులు



వెంకటాద్రిపాలెం రేషన్ షాపు వద్ద పడిగాపులు కాస్తున్న చెంచులు

పల్లె ప్రజల అష్టకష్టాలు...

కూటమి ప్రభుత్వ నిర్ణయంతో పల్లె ప్రజలు నానా అవస్థలు పడ్డారు. రేషన్ షాపు గ్రామంలో ఉంటుంది. కానీ పల్లెలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ కాలనీలు గ్రామానికి దూరంగా ఉంటాయి. ఆయా కాలనీ వాసులు బియ్యం, చక్కెర కోసం ఆటోలు వేసుకొని, ఆటోలకు బాడుగలు చెల్లించి మరీ రావాల్సిన పరిస్థితులను ప్రభుత్వం కల్పించింది. రేషన్ షాపుల పనివేళల వల్ల వ్యవసాయ పనులకు వెళ్లే వారు, కూలీలు ఇబ్బంది పడుతున్నారు. ఒకేసారి ఎక్కువమంది లబ్ధిదారులు రేషన్ కోసం వస్తే సర్వర్లు మొరాయిస్తున్నాయి. దీంతో లబ్ధిదారులు గంటల తరబడి పడిగాపులు పడాల్సిన పరిస్థితులు తలెత్తుతున్నాయి.

■ యర్రగొండపాలెం మండలంలోని వెంకటాద్రిపాలెం రేషన్ షాపు నుంచి అంకమ్మగూడెంకు చెందిన గిరిజన చెంచులు ఒక్కొక్కరు రూ.20 ఆటోలకు ఇచ్చి మరీ రేషన్‌ను తీసుకుపోవాల్సి వచ్చింది. ఇక్కడే కాదు అనేక చోట్ల ఇదే పరిస్థితి నెలకొంది.

4 కి.మీ వెళ్లి రేషన్ తెచ్చుకోవాలి



మా ఊరికి 4 కి.మీ దూరంలో సిద్దాయపాలెం ఉంది. రేషన్‌కు వెళితే సర్వర్ మొరాయించింది. గంటల తరబడి ఉండాల్సి వస్తోంది. గతంలో మా ఇంటికి వచ్చి రేషన్ అందించేవారు. ఈ ప్రభుత్వ తీరు మంచిది కాదు.

– కె.శ్రీనివాసరెడ్డి, నారపురెడ్డిపల్లి

వృద్ధులను రేషన్ షాపులకు రప్పిస్తున్న డీలర్లు

ప్రభుత్వం విధించిన నిబంధనల ప్రకారం 65 సంవత్సరాలు పైబడిన వృద్ధులతో పాటు, దివ్యాంగులకు ఇంటి వద్దకే సరుకులు పంపిణీ చేయాల్సి ఉంటుంది. అందుకోసం మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల మధ్య వాళ్ల ఇళ్లకే వెళ్లి పంపిణీ చేయాలి. అలాంటిది రేషన్ డీలర్లు అధికార టీడీపీకి చెందిన నాయకులే కావటంతో అదేం కుదరదు వృద్ధులైనా, వికలాంగులైనా రేషన్ షాపు వద్దకు రావాల్సిందేనంటూ హుకుం జారీ చేయటంతో ఆపసోపాలు పడుతూ వృద్ధులు సైతం రేషన్ షాపుల వద్దకే వచ్చి బియ్యం తీసుకుపోవాల్సిన పరిస్థితులను రేషన్ డీలర్లు కల్పిస్తున్నారు. ప్రభుత్వం 60 ఏళ్లు దాటితే వృద్ధాప్య పింఛన్ ఇస్తుంటే.. రేషన్ పంపిణీకి వచ్చేసరికి 65 ఏళ్లు పెట్టడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

■ రాచర్ల మండల కేంద్రంలో 65 సంవత్సరాల వృద్ధురాలు బియ్యానికి రావటంతో డీలరు షాపులోని బియ్యం గోతాముకు ఎత్తుకోవాలని చెప్పటంతో ఆ వృద్ధురాలు చేసేదేమీ లేక బియ్యాన్ని గోతాముకు ఎత్తుకుంది.



ఒంగోలు భరత్‌నగర్ రేషన్‌షాపు వద్ద నిలబడలేక కూర్చొన్న వృద్ధురాలు



షాపులో తానే బియ్యం తీసుకెళ్తున్న 65 ఏళ్ల వృద్ధురాలు

రేషన్ షాపునకు తాళం



మూతబడిన పెదఅలవలపాడు రేషన్ షాపు

పీసీపల్లి: మండల పరిధిలోని పెదఅలవలపాడు రేషన్ షాపు ఆదివారం తాళం వేసి ఉంది. కొత్తూరుపాడు, చింతలపాలెం, వడ్డెపాలెం వంటి దాదాపు ఐదారు గ్రామాల ప్రజలు 7, 8 కి.మీ నుంచి ఈ రేషన్ షాపునకు రావాల్సి ఉంది. కానీ డీలర్ అందుబాటులో లేకపోవడంతో నిత్యవసర సరుకులు సరుకుల కోసం పదేపదే తిరిగి అల్లాడుతున్నారు.

రేషన్ వాహనాలు రద్దు చేయడం సరికాదు



ప్రభుత్వం రేషన్ వాహనాలు రద్దు చేయడం వలన గిరిజనులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సుదూర ప్రాంతాల్లో ఉన్న చెంచుగూడెం వాసులు రేషన్ షాపులకు బియ్యం ఏ విధంగా తీసుకొని వెళ్లగలుగుతారు. గత ప్రభుత్వం ఇంటివద్దకే రేషన్ బియ్యం పంపించేలా చర్యలు తీసుకుంది. దీనివలన చెంచు మహిళలు తమ బియ్యం మూటలను నెత్తిన పెట్టుకొని మోసుకొని వెళ్లే బాధ తప్పింది. కూటమి ప్రభుత్వం ఎండీయూ వాహనాలు ఎందుకు రద్దు చేసిందో అర్థం కావడం లేదు. వెంటనే వాహనాలను పునరుద్ధరించి చెంచులను ఆదుకోవాలి.

– భూమని ఈరన్న, గిరిజన సంఘాల జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

ఏడాదైనా హామీల అమలేదీ..

- జూన్ 4న 'వెన్నుపోటు దినం'లో అందరూ పాల్గొనాలి
- వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి
- వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే అన్నా, బత్తుల



వాల్‌పోస్టరును ఆవిష్కరిస్తున్న బత్తుల బ్రహ్మానందరెడ్డి, అన్నా రాంబాబు తదితరులు

మార్కాపురం: సూపర్ 6 పథకాలు అమలు చేస్తానని హామీలిచ్చి అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వ తీరుకు నిరసనగా ఈనెల 4వ తేదీ బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన 'వెన్నుపోటు దినం' కార్యక్రమాల్లో ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ సీపీ అభిమానులు పాల్గొనాలని ఒంగోలు పార్లమెంట్ వైఎస్సార్ సీపీ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి, మార్కాపురం నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబులు పిలుపునిచ్చారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశం, ప్రెస్‌మీట్‌లో వెన్నుపోటు దినం వాల్‌పోస్టరును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బత్తుల బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా నగదు బదిలీ పథకం ద్వారా సుమారు రూ.2.70 లక్షల కోట్లను పేదలకు వారి ఖాతాల్లో జమ చేసి పేదల ఆర్థిక జీవన ప్రమాణాలను మెరుగుపరిచి దేశానికే ఆదర్శవంతమైన పాలన అందించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. నాడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యం ఉచితంగా అందించే ఉద్దేశంతో 200 వ్యాధులతో ఆరోగ్యశ్రీని ప్రారంభిస్తే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వాటి సంఖ్యను 2200కు పెంచి పేద ప్రజల ప్రాణాలు కాపాడారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సచివాలయ వ్యవస్థను, వలంటీర్ వ్యవస్థను ఏర్పాటుచేసి ప్రజల వద్దకే పరిపాలన అందించి గాంధీజీ ఆశయాలను అమలులోకి తెచ్చిన గొప్ప వ్యక్తి వైఎస్ జగన్ అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కార్పొరేట్ స్కూళ్లను తలదన్నేలా ఇంగ్లిషు విద్యను పేద విద్యార్థులకు అందించేందుకు నాడు.. నేడు.. ద్వారా విద్యా వ్యవస్థను అభివృద్ధి చేశారని అన్నారు.

అమలుకాని హామీలు...

గత ఎన్నికల ముందు దుష్ప్రచారాలతో, అలవికాని హామీలతో, ఈవీఎంల సహకారంతో వెన్నుపోటు ద్వారా అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలే అమలుచేయకుండా రెడ్ బుక్ రాజ్యాంగం ద్వారా ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని బత్తుల మండిపడ్డారు. తెనాలిలో ముగ్గురు అమాయక యువకులను పోలీసులు కొట్టడం దారుణమని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయనందుకు నిరసనగా జూన్ 4వ తేదీన జరిగే వెన్నుపోటు దినంలో ప్రజలు, వైఎస్సార్ సీపీ శ్రేణులు పాల్గొనాలని అన్నా రాంబాబు పిలుపునిచ్చారు. ఆరోజు ఉదయం 9.30 గంటలకు మార్కాపురం పాత బస్టాండులోని వైఎస్సార్ విగ్రహం వద్దకు అందరూ చేరుకోవాలని, అక్కడి నుంచి ర్యాలీగా సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకూ వెళ్లి వినతి పత్రం అందజేస్తామని రాంబాబు తెలిపారు. అనంతరం బత్తుల బ్రహ్మానందరెడ్డిని అన్నా రాంబాబు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ షంషేర్ ఆలీబేగ్, రాష్ట్ర కార్యదర్శి కేవీ రమణారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, వైస్ చైర్మన్ అంజమ్మ శ్రీనివాసులు, కౌన్సిలర్లు డాక్టర్ చప్పిల్లి కనకదుర్గ, సిరాజ్, సలీమ్, చంద్ర, వైఎస్సార్ సీపీ బూత్ కమిటీ రాష్ట్ర కార్యదర్శి పత్తి రవిచంద్ర, పార్టీ కార్యదర్శులు పత్తి రవిచంద్ర, బొగ్గరపు శేషయ్య, పీఎల్‌పీ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బియ్యం ధరలతో బెంబేలు..!

- పశ్చిమ ప్రకాశంలో బియ్యం కొరత
- తగ్గిన వరిసాగుతో ఇబ్బందులు
- ఇతర జిల్లాల నుంచి తెచ్చి అధిక ధరలకు విక్రయిస్తున్న వ్యాపారులు
- ఆందోళనలో ప్రజలు



మార్కాపురంలో ఉన్న బియ్యం నిల్వలు

మార్కాపురం: పశ్చిమ ప్రకాశంలో బియ్యం కొరత ఏర్పడింది. గత ఖరీఫ్, రబీ సీజన్లలో వరిసాగు తగ్గిపోవడంతో ఉత్పత్తి కూడా తగ్గిపోయింది. దీంతో ఇతర ప్రాంతాల నుంచి బియ్యం తెప్పించి ఇక్కడ అధిక ధరలకు వ్యాపారులు అమ్ముతున్నారు. పల్నాడు, బాపట్ల, కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచి పలువురు వ్యాపారులు లారీల్లో బియ్యాన్ని తెచ్చి విక్రయిస్తున్నారు. స్థానికంగా ఉన్న బియ్యం కొరతను ఆసరాగా చేసుకుని బస్తాకు 100 నుంచి 200 రూపాయలు పెంచి విక్రయిస్తున్నారు. ఈ ఏడాది పశ్చిమ ప్రకాశంలో వరిసాగు తక్కువగా ఉండటంతో నరసరావుపేట, పల్నాడు, బాపట్ల, నంద్యాల, ఆత్మకూరు ప్రాంతాల నుంచి బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. గత నెలాఖరులో బీపీటీ రకం 6 వేల రూపాయలు ఉండగా, పదిరోజుల వ్యవధిలోనే బస్తా ధర 200 రూపాయలు పెరిగింది. గత రెండు రోజుల నుంచి మరో 100 రూపాయలు పెంచి విక్రయిస్తున్నారు. మార్కాపురం పట్టణంలో సుమారు 20 మందికిపైగా బియ్యం హోల్‌సేల్ వ్యాపారులు ఉన్నారు. వీరు కర్నూల్ సోనా, బీపీటీ, నంబర్లు, తదితర రకాల బియ్యాన్ని అమ్ముతుండటంతోపాటు స్థానికంగా బియ్యాన్ని సేకరించి ఏదో బ్రాండ్ నేమ్‌ను బస్తాలపై వేసి సూపర్ క్వాలిటీ అంటూ పాతిక కిలోల టిక్కీని 1400 నుంచి 1600 రూపాయలకు విక్రయిస్తున్నారు. అంటే 100 కేజీల బస్తాకు 5,600 నుంచి 6,400 రూపాయల వరకూ విక్రయిస్తున్నారు.

పైపైకి బియ్యం ధరలు...

పశ్చిమ ప్రకాశంలో బియ్యం ధరలు పైపైకిపోతున్నాయి. ఈ ఏడాది ఖరీఫ్, రబీ సీజన్లలో వరి సాగు తగ్గిపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి బియ్యాన్ని దిగుమతి చేసుకుంటున్నారు. మనిషి తీసుకునే ఆహారాల్లో బియ్యంకు మొదటి ప్రాధాన్యత ఉండటంతో ప్రతిఒక్కరూ బియ్యాన్ని కొనుగోలు చేస్తుంటారు. దీంతో బియ్యం ధరలకు రెక్కలు వచ్చాయి. ఖరీఫ్ సీజన్‌లో డివిజన్‌లోని 13 మండలాల్లో 5,563 హెక్టార్లలో వరి సాగుచేయాల్సి ఉండగా, 4,367 హెక్టార్లలోనే సాగు చేశారు. మార్కాపురం, కంభం, అర్ధవీడు, యర్రగొండపాలెం, త్రిపురాంతకం, పెద్దారవీడు, పెద్దదోర్నాల మండలాల్లో వరిసాగు గణనీయంగా తగ్గిపోయింది.

వరి సాగు చేయాలంటేనే భయపడుతున్న రైతులు...

కడప జిల్లా ప్రొద్దుటూరు, కర్నూలు, గుంటూరు జిల్లా నరసరావుపేట, సత్తెనపల్లి ప్రాంతాల నుంచి కొంత మంది వ్యాపారులు బియ్యాన్ని హోల్‌సేల్‌గా కొనుగోలు చేసి పశ్చిమ ప్రకాశంలో అమ్ముతున్నారు. వరి సాగు లేకపోవటం, రాబోయే నాలుగు నెలల వరకు పంట వచ్చే అవకాశం లేకపోవటంతో బియ్యం ధరలు బస్తా 5600 నుంచి 6 వేల రూపాయలకు చేరాయి. పెట్టుబడి వ్యయం ఎక్కువగా పెరగడం, ఆశించిన స్థాయిలో దిగుబడులు రాకపోవటం, తీవ్రమైన వర్షాభావ పరిస్థితులు ఏర్పడడం, భూగర్భజలాలు అడుగంటి పోవటంతో నీటి కొరత ఏర్పడి వరి సాగు చేయాలంటేనే రైతులు భయపడుతున్నారు. వరిని సాగు చేసే కంభం, పుల్లలచెరువు, త్రిపురాంతకం, మార్కాపురం, తదితర మండలాల్లో చెరువుల్లో నీరులేకపోవటం, సాగర్ నీటి సరఫరా లేకపోవటంతో ఈ ఏడాది వరి సాగు తగ్గిపోయింది.

మార్కాపురం డివిజన్‌లో వరిసాగు ఇలా...

మండలం	సాగు చేయాల్సిన విస్తీర్ణం	సాగైన విస్తీర్ణం (హెక్టార్లలో)
మార్కాపురం	118	82
తర్లుపాడు	212	206
గిద్దలూరు	231	223
బేస్తవారిపేట	207	256
కంభం	416	201
అర్ధవీడు	197	158
కొమరోలు	379	429
రాచర్ల	85	108
వై.పాలెం	7	0
పుల్లలచెరువు	913	968
త్రిపురాంతకం	2745	1734
పెద్దారవీడు	12	1
పెద్దదోర్నాల	41	1

బియ్యం ధరలు బాగా పెరిగాయి



గత నెల కంటే ఈ నెలలో బియ్యం ధరలు అధికంగా పెరిగాయి. టిక్కీ 1350 నుంచి 1500 రూపాయలకు పెరిగింది. రాబోయే నాలుగైదు నెలల వరకూ కొత్త బియ్యం వచ్చే పరిస్థితి లేదు. దీంతో ధరలు మరింత పెరిగే అవకాశం ఉండటంతో బియ్యం కొనిపెట్టుకుంటే మేలనే అభిప్రాయం ప్రజల్లో ఏర్పడింది. ధరలు పెరగకుండా అధికారులు చూడాలి.
– వి.శ్రీనివాసులు, మార్కాపురం

క్లుప్తంగా

అనుమానాస్పద వ్యక్తుల సమాచారం ఇవ్వండి

● డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు



లాడ్జీలు, హోటళ్ల యజమానులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ

ఒంగోలు టౌన్: లాడ్జీలు, హోటళ్లకు వచ్చే అనుమానాస్పద వ్యక్తుల సమాచారాన్ని వెంటనే పోలీసులకు అందివ్వాలని డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు ఆదేశించారు. జిల్లా పోలీసు కల్యాణ మండపంలో ఆదివారం లాడ్జీలు, హోటళ్ల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ..నగరంలోని హోటళ్లు, లాడ్జీలలో భద్రతా పరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, పార్కింగ్, ఇతర కీలక ప్రాంతాలలో హై క్వాలిటీ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నిరంతరం పనిచేసేలా చూడాలని, రికార్డింగులు భద్రపరచేలా చూడాలన్నారు. కష్టమర్లకు గదులు కేటాయించే సమయంలో గుర్తింపు కార్డులైన ఆధార్, పాస్‌పోర్ట్, డ్రైవింగ్ లైసెన్సులను పరిశీలించాలని, వాటి జిరాక్స్ కాపీలను డిజిటల్ స్కాన్‌ను భద్రపరచాలని చెప్పారు. అనుమానాస్పదంగా కనిపిస్తే అదనపు గుర్తింపు కార్డులను తీసుకోవాలని , కష్టమర్ల వివరాలు, బస చేసే సమయం, వారి స్వస్థలం వంటి సమగ్ర సమాచారాన్ని సేకరించాలన్నారు. చట్టవిరుద్ధంగా ఎవరికీ లాడ్జీలు ఇవ్వరాదని, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు తావిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాలికలతో వచ్చిన వారు అనుమానాస్పదంగా కనిపిస్తే వారికి గదులు అద్దెకు ఇవ్వరాదన్నారు. అసాధారణ ప్రవర్తన గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం తెలియజేయాలని సూచించారు. సమావేశంలో తాలుకా సీఐ విజయకృష్ణ, టూటౌన్ సీఐ మేడా శ్రీనివాసరావు, వన్‌టౌన్ సీఐ నాగరాజు, ఎస్సైలు హరిబాబు, ఫణి భూషణ్, ఎస్‌వీ రమణ, పున్నారావు పాల్గొన్నారు.

బదిలీల్లో అసంబద్ధ నిర్ణయాలు తొలగించాలి

● జిల్లా ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక డిమాండ్



డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక నాయకులు

ఒంగోలు సిటీ: ఉపాధ్యాయ బదిలీల్లో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక నాయకులు ఆదివారం డీఈఓ కిరణ్‌కుమార్‌ను కలిసి ఉపాధ్యాయ బదిలీల సమస్యలపై మాట్లాడి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక నాయకులు మాట్లాడుతూ బలవంతంగా పీఎస్ హెచ్‌ఎం పోస్టులను కోరుకోమని, బదిలీకి దరఖాస్తు చేయని వారిని, పాఠశాలలో సర్‌ప్లస్ కానప్పటికీ వారిచేత దరఖాస్తు చేయించడం పట్ల తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. వారికి ఈ బలవంతపు బదిలీ నుంచి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్కూల్ అసిస్టెంట్లకు సబ్జెక్టు వేకేన్సీతో పాటు పీఎస్ హెచ్‌ఎం పోస్టులకు ఒకేసారి ఆప్షన్ వచ్చేలా కల్పించాలన్నారు. జీఓ 22లోని 11వ నిబంధనను అనుసరించి పాయింట్స్ సమానమైనప్పుడు క్యాడర్ సీనియారిటీని మాత్రమే ముందుగా పరిగణలోనికి తీసుకొని సీనియారిటీ జాబితా తయారు చేయాలన్నారు. గ్రీవెన్స్ పూర్తి చేసి ఫైనల్ సీనియారిటీ లిస్ట్ ప్రకటించిన తర్వాతే వెబ్‌ఆప్షన్స్ అవకాశం కల్పించాలన్నారు. కార్యాలయ సమాచారం ఉపాధ్యాయ సంఘాలకు వాట్సాప్ గ్రూప్ ద్వారా తెలియజేయాలన్నారు. మిగిలిన గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుల పోస్టులను ప్రస్తుత సీనియారిటీ కొనసాగించి పూర్తి చేయాలన్నారు. అన్ని సబ్జెక్టులకు సంబంధించిన క్యాడర్ స్ట్రెంత్ వివరాలు అడిక్విసి పేర్లతో సహా ఇవ్వాలన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కొమ్మోజు శ్రీనివాసరావు, ఏపీయుఎస్ రాష్ట్ర బాధ్యులు సీహెచ్ శ్రావణ్‌కుమార్, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వి.జనార్ధనరెడ్డి, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్‌కే అబ్దుల్ హై, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎర్రయ్య, ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు ఎం.మల్లికార్జునరావు, ఎన్.లక్ష్మీనారాయణ, వెంకటరావు, ఉమామహేశ్వరి, రమణారెడ్డి, వెంకటేశ్వర్లు, శేషారావు పాల్గొన్నారు.

క్రీడల్లో మహిళల సత్తా అభినందనీయం

● ఎస్పీ ఏఆర్ దామోదర్



విజేతలతో ఎస్పీ దామోదర్

ఒంగోలు : మహిళలు క్రీడారంగంలోనూ అద్భుతంగా రాణిస్తున్నారని, అత్యంత ప్రతిభతో సత్తా చాటుతుండటం అభినందనీయమని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. 12వ రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన మహిళా క్రీడాకారులకు ఆదివారం నగరంలోని మినీ స్టేడియంలో ఎస్పీ చేతుల మీదుగా పతకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కృషి, పట్టుదల ఉంటే ఏ రంగంలోనైనా రాణించవచ్చని మహిళా క్రీడాకారులు నిరూపిస్తున్నారన్నారు. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తి అలవరచుకోవాలని, జీవితంలో ఎదురయ్యే గెలుపోటములను సమానంగా స్వీకరించాలని సూచించారు. ప్రతిఒక్కరూ తమ పిల్లలను కూడా క్రీడల్లో ప్రోత్సహించాలని, చదువుతో పాటు క్రీడల్లో రాణించేలా తోడ్పాటునందించాలని అన్నారు. జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించి జాతీయ స్థాయిలో విజేతలుగా నిలిచి వారికి పోలీసు శాఖ తరపున బహుమతులు ఇస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో ఒంగోలు తాలూకా పోలీస్‌స్టేషన్ సీఐ విజయకృష్ణ, డీఎస్‌డీఓ రాజేశ్వరి, పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జి.భక్తధృవుడు, జిల్లా పవర్ లిఫ్టింగ్ వైస్ ప్రెసిడెంట్ పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు వెన్నుపోటు పొడిచిన బాబు

● ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి, ఐటీ వింగ్ ఉద్యోగులు

యర్రగొండపాలెం: మోసపు మాటలు చెప్పి గద్దెనెక్కిన చంద్రబాబు రాష్ట్ర ప్రజలను వంచించి వెన్నుపోటు పొడిచాడని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం హైదరాబాదులో ఐటీ వింగ్ ఉద్యోగులతో కలిసి ఆయన వెన్నుపోటు దినం వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాఠశాలల్లో చదివే చిన్నారుల నుంచి రైతులు, వ్యవసాయ కూలీలు, ప్రభుత్వ పథకాలపై ఆధారపడి జీవించే ప్రజలకు చంద్రబాబు వెన్నుపోటు పొడిచాడని విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఊసెత్తని బాబు దగా మాటలు చెప్పేందుకు మహానాడు జరిపాడన్నారు. ఏడాది పాలనలో ఏం సాధించావని ప్రశ్నిస్తే కడపకు వెళ్లి మహానాడు జరిపానని బదులిస్తాడని ఆయన వ్యంగ్యంగా అన్నారు. రాష్ట్ర ప్రజలకు ఏం చేశామని చెప్పుకోలేని దౌర్భాగ్యపు పరిస్థితి మహానాడులో వారికి ఏర్పడిందని, అధికారంలోకి వచ్చిన తరువాత ఈ రాష్ట్రాన్ని ఏ విధంగా వంచించారో మహానాడు ద్వారా బయటపెట్టారన్నారు. కడపలో దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డిని అవమానపరుస్తూ విగ్రహం చుట్టూ పచ్చతోరణాలు కట్టి తమ అధికార మదం ఏంటో రుజువు చేసుకున్నారని మండిపడ్డారు. తిరుగులేని అప్పుల రాష్ట్రంగా రికార్డుల్లో ఎక్కుతున్న చంద్రబాబు ప్రభుత్వంపై గళం విప్పుదామని ఆయన ఐటీ వింగ్ ఉద్యోగులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు దొండేటి నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

35 ఏళ్ల తర్వాత కలుసుకుని..



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

● 1989–90 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ కలయిక

కొత్తపట్నం: 35 ఏళ్ల క్రితం కొత్తపట్నంలోని బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయంగా కలుసుకుని ఆనందంగా గడిపారు. కొత్తపట్నంలోని నల్లూరి గార్డెన్స్ వేదికగా నిర్వహించిన 1989–90 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో సుదీర్ఘకాలం తర్వాత కలుసుకున్న బాల్యమిత్రులంతా సందడి చేశారు. పురిణి చెంచు రామయ్య అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ముందుగా తమతో కలిసి చదువుకుని వివిధ కారణాలతో మరణించిన వారి ఆత్మకు శాంతిచేకూరాలని నిమిషం పాటు మౌనం పాటించి నివాళులర్పించారు. అనంతరం ఒకరికొకరు ఆనాటి జ్ఞాపకాలను నెమరవేసుకుంటూ ఆనంద సాగరంలో మునిగితేలారు. తాము చదువుకున్న చదువులు, కలిసి తిరిగిన ప్రాంతాలు, చేసిన అల్లరిని గుర్తుచేసుకున్నారు. టెక్నాలజీ అరకొరగా ఉన్న సమయంలో ఎంతో కష్టపడి చదువుకుని ఎన్నో ఆర్థిక సమస్యలు ఎదుర్కొని జీవితంలో స్థిరపడిన తర్వాత చిన్ననాటి స్నేహితులను కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉందని వారంతా హర్షం వ్యక్తం చేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అందరూ కలిసిమెలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో గొల్లపూడి దత్తాత్రేయశర్మ, దోసపాటి పాణి, బొబ్బాల బాలాజీ, నాగమల్లేశ్వరి, వసంతకుమారి, జ్ఞానేశ్వరి, అపర్ణ, జయంతి, అన్నం తిరుపతిరావు, రామకృష్ణ, ప్రకాశ్‌రావు, అరుణ, కాలేషా, దేవమణి, శ్రీనివాసరావు, ఇతర విద్యార్థులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా అక్రమ కట్టడం



వైద్యశాల ముందు భాగంలో అక్రమంగా నిర్మించిన కట్టడం

సాక్షి టాస్క్‌ఫోర్స్: గిద్దలూరు పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల ముందు భాగంలో వైద్యశాలలో పనిచేస్తున్న ఔట్‌స్సోర్సింగ్ ఉద్యోగి అక్రమ నిర్మాణం చేపట్టాడు. స్థానిక టీడీపీ నాయకుల అండదండలతో వైద్యశాల ముందుభాగంలో క్యాంటీన్ నిర్మాణం చేపట్టి వ్యాపారం చేయాలని చూస్తున్నాడు. దీనిపై ఒంగోలుకు చెందిన దేశబోయిన వెంకటరాజు సోషల్ మీడియాలో పోస్టు పెట్టడమే కాకుండా అక్రమ కట్టడాన్ని తొలగించాలంటూ అధికారులను కలిసి ఫిర్యాదు చేశారు. దీంతో ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ వైద్యశాల ఆవరణలో అక్రమంగా నిర్మిస్తున్న కట్టడాన్ని తొలగించాలంటూ ఉద్యోగి పందరబోయిన శ్రీనివాసులుకు నోటీసులు జారీ చేశారు. నోటీసులు అందుకున్న శ్రీనివాసులు.. అధికార పార్టీ నాయకులను ఆశ్రయించాడు. దాంతో అక్రమ కట్టడం తొలగింపు చర్యలు నిలిచిపోయాయి. అధికార పార్టీ నాయకుల అండదండలు ఉంటే చాలు.. ప్రభుత్వ నిబంధనలకు అధికారులు పాతరవేస్తున్నారనే విషయం తేటతెల్లమవుతోందని ప్రజలు విమర్శిస్తున్నారు. ప్రభుత్వ స్థలంలో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నప్పటికీ అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారంటే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పరిపాలన ఎంత నీచంగా ఉందో అర్థమవుతోందని ప్రజలు చర్చించుకుంటున్నారు. అక్రమ కట్టడంపై ఓ వ్యక్తి నేరుగా ఫిర్యాదులు చేస్తున్నప్పటికీ చర్యలు చేపట్టకపోవడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అక్రమంగా నిర్మిస్తున్న కట్టడంపై చర్యలు ఉంటాయో.. లేదో.. వేచి చూడాలి మరి.

7 నుంచి యర్రగొండపాలేనికి ఎక్స్‌ప్రెస్ సర్వీసులు

ఒంగోలు టౌన్: జిల్లాలోని యర్రగొండపాలేనికి ఒంగోలు నుంచి రెండు ఎక్స్‌ప్రెస్ సర్వీసులు నడపనున్నట్లు ఒంగోలు ఆర్టీసీ డిపో మేనేజర్ డి.శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7వ తేదీ నుంచి ప్రతిరోజూ ఉదయం 6 గంటలకు ఒకటి, 10.30 గంటలకు మరొకటి చొప్పున బస్సులు బయలుదేరుతాయని చెప్పారు. రోజుకు నాలుగు ట్రిప్పులు నడుస్తాయని వివరించారు. అలాగే ప్రతి శనివారం మాలకొండకు అదనంగా బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు తెలిపారు. ఈ శనివారం పామూరు రూట్ నుంచి మొత్తం 17 సర్వీసులు తిప్పగా 3.19 లక్షల రూపాయల ఆదాయం వచ్చినట్లు వెల్లడించారు. ఈ నెల 15వ తేదీ నుంచి నరవాడ జాతర సందర్భంగా ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేశామని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తప్పుల తడకగా డీఎస్సీ హాల్ టికెట్లు





లక్ష్మీ మాధురి దరఖాస్తు , లక్ష్మీ మాధురి హాల్ టికెట్

● లబోదిబోమంటున్న అభ్యర్థులు

దర్శి (కురిచేడు): డీఎస్సీ కోసం తాము చేసుకున్న దరఖాస్తులోని వివరాలను పక్కన పెట్టి వారి ఇష్టానుసారం వివరాలు ఇచ్చారని దర్శికి చెందిన డీఎస్సీ అభ్యర్థి ఎం లక్ష్మీ మాధురి ఆందోళన వ్యక్తం చేశారు. తన విద్యాభ్యాసం అంతా గుంటూరు జిల్లాలో జరిగిందని, అందువల్ల తన దరఖాస్తులో కూడా గుంటూరు జిల్లాకు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపింది. ప్రస్తుతం తన తండ్రి వృత్తి రీత్యా దర్శిలో నివాసముంటున్నాడని పేర్కొంది. అయితే తన హాల్ టికెట్లో మాత్రం తన పూర్తి చదువు ప్రకాశం జిల్లాలో చదివినట్లు వచ్చిందని ఆందోళన వ్యక్తం చేసింది. దాని వల్ల సొంత జిల్లాకు దూరం కావడమే కాకుండా సర్టిఫికెట్లు వెరిఫికేషన్ లోకూడా తేడా కనిపిస్తుందని తెలిపింది. ప్రభుత్వం ఈ తప్పులను సరిచేసి తనకు, తనలాంటి వారికి న్యాయం చేయాలని కోరింది.

ఉత్సాహంగా క్రికెట్ జట్ల ఎంపిక



క్రికెట్ జట్లకు ఎంపికైన క్రీడాకారులు

ఒంగోలు: క్రికెట్ క్రీడా జట్ల ఎంపిక స్థానిక మంగమూరు రోడ్డులోని మినీ లార్డ్స్ మైదానంలో ఆదివారం ఉత్సాహంగా సాగింది. పురుషుల విభాగంలో అండర్ 19, సీనియర్స్, మహిళల విభాగంలో అండర్ 15, అండర్ 19 క్రీడాజట్ల ఎంపిక జరిగింది. ఎంపిక ప్రక్రియను ఆంధ్రా రంజీ క్రీడాకారుడు శరత్ పర్యవేక్షించారు. బౌలింగ్, బ్యాటింగ్, ఫీల్డింగ్, కీపింగ్‌లో ప్రతిభను పరిశీలించి జట్లను ఎంపిక చేశారు. ఎంపికైన బాలబాలికల జట్లు ఈ నెల 10 నుంచి మంగళగిరిలో జరిగే అంతర్ జిల్లాల పోటీల్లో జిల్లా తరుపున ప్రాతినిధ్యం వహిస్తారని ప్రకాశం జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి కారుసాల నాగేశ్వరరావు తెలిపారు. ఎంపిక ప్రక్రియలో కోశాధికారి హనుమంతరావు, సభ్యులు బలరాం, రాము, మహేష్, రామకృష్ణ, కోచ్‌లు పాల్గొన్నారు.

దేశ సమైక్యతను కాపాడుకోవాలి

● మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు

ఒంగోలు టౌన్: దేశ సమైక్యతను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని శాసనమండలి మాజీ సభ్యుడు కేఎస్ లక్ష్మణరావు పిలుపునిచ్చారు. నగరంలోని సుందరయ్య భవనంలో ఆదివారం జరిగిన సమైక్యతా సదస్సులో ఆయన మాట్లాడారు. ఏప్రిల్ 22వ తేదీన పెహల్గాం ఉగ్రవాద దాడుల్లో 26 మంది మరణించారని, ఈ ఘటనపై దేశ వ్యాప్తంగా నిరసనలు మిన్నంటాయని చెప్పారు. ఉగ్రదాడిని దేశ వ్యాప్తంగా సమైక్యంగా ఖండించారని గుర్తు చేశారు. అయినా బీజేపీ, కార్పొరేట్ మీడియా, వాట్సప్ యూనివర్శిటీలు హిందువులను ముస్లింలు హత్య చేశారని వక్రీకరించి ట్రోల్ చేశారని చెప్పారు. దీంతో బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ముస్లింలపై 184 దాడులు జరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిజానికి ఉగ్రవాద దాడులను నుంచి తమను స్థానిక ముస్లింలే రక్షించారని బాధితులు చెప్పడం గమనించాలని కోరారు. ఈ ఘటన తరువాత జరిగిన పరిణామాలు దేశ సార్వభౌమత్వానికి మచ్చ తెచ్చేలా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పాకిస్తాన్‌పై యుద్ధ విమానాలతో విరుచుకొని పడిన కల్నల్ సోఫియాపై బీజేపీ మంత్రి చేసిన వ్యాఖ్యను సుప్రీం కోర్టు సీరియస్‌గా తీసుకోవాల్సి వచ్చిందన్నారు. ఆపరేషన్ సిందూర్‌ను బీహార్ ఎన్నికల అస్త్రంగా మార్చుకోవడం ఆక్షేపనీయమన్నారు. భారత్ పాక్ యుద్ధం విషయంలో దేశ సార్వభౌమత్వాన్ని మోదీ అమెరికాకు తాకట్టు పెట్టారని విమర్శించారు. కాశ్మీర్ సమస్యలను మోదీ ప్రభుత్వం పెంచి పెద్దది చేసిందన్నారు. 370 అధికరణను రద్దు చేయడం, కనీస రాష్ట్ర హోదా లేకుండా చేయడం అక్కడి ప్రజల మనోభావాలు దెబ్బతీసే విధంగా ఉన్నాయన్నారు. దేశంలోని భిన్నత్వాన్ని రక్షించుకునేందుకు ప్రజాస్వామిక వాదులు ముందుకు రావాలన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ మాట్లాడుతూ పెహల్గాం దాడుల వెనుక భద్రతా దళాల వైఫల్యం వుందని చెప్పారు. సీపీఐఎంఎల్ న్యూ డెమొక్రసి రాష్ట్ర అధికార ప్రతినిధి చిట్టిపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. బీజేపీ మతతత్వ విధానాల వల్ల దేశంలో సామరస్యం దెబ్బతింటుందన్నారు. కార్యక్రమంలో వివిధ వామపక్ష పార్టీల నాయకులు డివిఎస్ స్వామి, చుండూరి రంగారావు, జీవీ కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు, రఫీ, చీకటి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టులతో కేంద్రం చర్చలు జరపాలి

ఒంగోలు టౌన్: శాంతి చర్చలకు సంసిద్ధత తెలుపుతున్న మావోయిస్టులతో కేంద్రం ఎందుకు చర్చలు జరపడం లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య ప్రశ్నించారు. ఆపరేషన్ ఖగార్ పేరుతో దండకారణ్యంలో అమాయక ఆదివాసీలను, మావోయిస్టులను అత్యంత పాశవికంగా కాల్చి చంపుతున్నారని, మావోయిస్టు పార్టీ కేంద్ర కార్యదర్శి నంబాల కోటేశ్వరరావు మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించకుండా అడవిలోనే అంత్యక్రియలు నిర్వహించడం ప్రభుత్వ నిరంకుశ చర్యలకు నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలోని మల్లయ్యలింగం భవనంలో సీపీఐ నగర మహాసభ ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సభకు కె.అంజయ్య, ఇస్తర్ల నరసింహారావు అధ్యక్షులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా గుజ్జుల మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెడుతూ దేశాన్ని అప్పుల ఊబిలో నెడుతున్నారని విమర్శించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ మాట్లాడుతూ ఈ నెల 21, 22, 23 తేదీల్లో దర్శిలో నిర్వహిస్తున్న సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. తొలుత ప్రముఖ న్యాయవాది మురివర్తి రాఘవులు జెండావిష్కరణ చేశారు. ఈ సభలో కొత్తకోట వెంకటేశ్వర్లు, ఆర్ వెంకటరావు, రామకృష్ణ, కారుమూడి నాగేశ్వరరావు, నూనె మోహనరావు, ఆదినారాయణ, ఎంఏ సాలార్ తదితరులు పాల్గొన్నారు.